

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

అకాల వర్షం

మామిడికి తీవ్ర నష్టం



యాదమరిలో నేలరాలిన మామిడి కాయలు

చిత్తూరు సెంట్రల్, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలులతో మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఆదివారం కూడా చిత్తూరుతోపాటు పలమనేరు, బంగారుపాళ్యం, యాదమరి మండలాల్లో వర్షం కురవడంతోపాటు బలమైన ఈదురుగాలులు వీచాయి. ఈ ప్రాంతాల్లోని మామిడి కాయలు నేల రాలాయి. ఇప్పటికే పెనుమూరు, యాదమరి, చిత్తూరు రూరల్, గుడిపాల, పలమనేరు, ఐరాల, తవణంపల్లె మండలాల్లో 435 ఎకరాల్లో మామిడితోపాటు ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు లెక్కలు కట్టారు. తాజాగా కురిసిన వర్షం, ఈదురు గాలులకు మామిడితోపాటు సుమారు 50 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. సోమవారం నుంచి నష్టం వివరాలను సేకరించనున్నారు.





చిత్తూరు విజయనగర్‌కాలనీలో రోడ్డుపై కూలిన విద్యుత్ స్తంభం, కొంగారెడ్డిపల్లెలోని కరుమారెమ్మ గుడి వద్ద కూలిన చెట్లను తొలగిస్తున్న నగరపాలక సిబ్బంది

తప్పిన పెనుప్రమాదం



చిత్తూరు కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల ప్రవేశ మార్గం వద్ద ఆదివారం సాయంత్రం వీచిన పెను గాలులకు విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాసుకుని మంటలు చెలరేగి, తెగిపడ్డాయి. ఆ సమయంలో అక్కడెవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఎందుకంటే నీట్ రాస్తున్న తమ పిల్లల కోసం అప్పటి వరకు కళాశాల ప్రవేశ మార్గం వద్ద తల్లిదండ్రులు వేచి ఉన్నారు. గాలివాన ప్రారంభం కాగానే అందరూ కళాశాల ఆవరణలోకి వెళ్లిపోవడంతో ప్రమాదం తప్పింది. కళాశాల యాజమాన్యం కూడా అప్రమత్తమై సంబంధిత శాఖకు ఫిర్యాదు చేయడంతో విద్యుత్ సరఫరాను ఆపేశారు.

→ కళాశాల వద్ద తెగిన విద్యుత్ తీగలను సరి చేస్తున్న సిబ్బంది

విద్యుత్ శాఖకు రూ.20లక్షలకు పైగా నష్టం

● చిత్తూరులో గాలివాన

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం కురిసిన గాలివానకు విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. ఆ శాఖకు రూ.20 లక్షలకుపైగా నష్టం కలిగింది. సాయంత్రం నాలుగు గంటల తర్వాత చిత్తూరులో గాలివాన కురిసింది. నగరంలోని కొంగారెడ్డిపల్లె, విజయలక్ష్మీనగర్‌కాలనీ, కొంగారెడ్డిపల్లె, షర్మన్ పాఠశాల ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. కొన్నిచోట్ల తీగలు తెగడం, స్తంభాలు నేలకూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

భానుడి భగభగలు

ఓవైపు వర్షం.. మరోవైపు 40 డిగ్రీలు, అంతకన్నా ఎక్కువ ఉష్ణోగ్రత నమోదు



చిత్తూరులో కురుస్తున్న వాన

చిత్తూరు కలెక్టరేట్, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓవైపు వానలు కురుస్తున్నా.. మరోవైపు భానుడి భగభగలు కొనసాగుతూనే ఉన్నాయి. శ్రీరంగరాజపురం మండలంలో 41.2, గుడిపాలలో 40.8, తవణంపల్లెలో 40.4, చిత్తూరు, గంగాధరనెల్లూరులో 40 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండలాలవారీగా.. పులిచెర్ల, పూతలపట్టు, వెదురుకుప్పంలో 39, కార్వేటినగరంలో 38.5, బంగారుపాళ్యంలో 38.3, బైరెడ్డిపల్లె, చౌడేపల్లె, గుడుపల్లె, ఐరాల, నగరి, నింద్ర, పాలసముద్రం, పెనుమూరు, శాంతిపురంలో 37.5, రొంపిచెర్లలో 37.2, గంగవరం, పెద్దపంజాణి, వి.కోట, విజయపురం, యాదమరిలో 37.1, సదుంలో 36.7, సోమలలో 36.1, రామకుప్పంలో 35.1, కుప్పం, పలమనేరులో 34.8, పుంగనూరులో 27.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

4 మండలాల్లో వాన: జిల్లాలోగడిచిన 24 గంటల్లో నాలుగు మండలాల్లో వర్షం కురిసింది. మండలాలవారీగా.. కుప్పంలో 23, పుంగనూరులో 20.2, గుడుపల్లెలో 3.2, బైరెడ్డిపల్లెలో 0.6 మి.మీ వర్షపాతం నమోదైంది.



ప్రశాంతంగా నీట్

● పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ ● 33 మంది విద్యార్థుల గైర్హాజరు



పీవీకేఎన్ కళాశాల వద్ద కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ

చిత్తూరు సెంట్రల్, మే 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో ఆదివారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రన్స్ టెస్టు) ప్రశాంతంగా జరిగింది. స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్పీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం 11.30 గంటల నుంచే విద్యార్థులకు ఇచ్చిన స్లాట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేశాకే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ పరిశీలించారు. 710 మందికి 677 మంది హాజరవగా, 33 మంది గైర్హాజరైనట్లు జిల్లా నోడల్ అధికారి కృష్ణబాబు తెలిపారు. పీవీకేఎన్‌లో 432 మందికి 413 మంది హాజరవగా, 19 మంది గైర్హాజరైయారు. ఎస్పీ సావిత్రమ్మ డిగ్రీ కళాశాలలో 278 మందికి 264 మంది హాజరవగా, 14 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణలో నీట్ కోఆర్డినేటర్ జీవనజ్యోతి, సావిత్రమ్మ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాష, పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ శరవణ తదితరులు పాల్గొన్నారు. రెండు పరీక్ష కేంద్రాల వద్ద రద్దీని అనుగుణంగా షామియానాలు, తాగునీటి వసతి ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బంది పడ్డారు.

చిత్తూరులోని ఎస్పీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థుల సందడి

తప్పదు మరి



విద్యార్థినుల తల వెంట్రుకల్లోనూ తనిఖీలు

విద్యార్థి చెయ్యి కాదు.. షర్టు హ్యాండ్ కట్ చేస్తూ..

వీల్‌చెయిర్‌లో వస్తున్న విద్యార్థిని

వరసిద్ధుడి దర్శనానికి 3 గంటలు

ఐరాల(కాణిపాకం), మే 4 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి ఆదివారం మూడు గంటలకుపైగా సమయం పట్టింది. జిల్లా నలుమూలల నుంచి స్వామి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో క్యూలైన్లు ఆలయం వెలుపలకు వ్యాపించాయి. ప్రతి భక్తుడికీ స్వామి దర్శనం కల్పించడానికి ఆలయ ఈవో పెంచలకిషోర్ క్యూలైన్లను పర్యవేక్షించారు.

ఆలయం వెలుపల క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



పెనుగులాటలోనే గున్న ఏనుగు మృతి



ఎఫ్ఆర్వోతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీఎఫ్‌వో భరణి

చిత్తూరు సెంట్రల్, మే 4 (ఆంధ్రజ్యోతి): పెనుగులాటలోనే ఓ గున్న ఏనుగు మృతి చెందినట్లు డీఎఫ్‌వో భరణి వెల్లడించారు. ఆదివారం తన చాంబర్‌లో తూర్పు ఎఫ్ఆర్వో థామస్ సుకుమార్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏనుగు మృతికి గల కారణాలు ఆమె వెల్లడించారు. పలమనేరు అటవీ ప్రాంతంలోని గౌనిచెరువు వద్ద శనివారం ఓ గున్న ఏనుగు మృతి చెందడంపై వచ్చిన పోస్టుమర్టం నివేదిక ఆధారంగా మృతికి గల కారణాలు తెలియజేశారు. ఘటన జరిగిన సమయంలో 13 ఏనుగులతోపాటు ఓ గున్న ఏనుగు గుంపుగా ఉండేవన్నారు. వీటిమధ్య జరిగిన పెనుగులాటలో గున్న ఏనుగుకు మర్మాంగాలపై బలమైన గాయాలు కావడం, శరీరం లోపలి భాగాల్లో దెబ్బలు తగలడంతో తట్టుకోలేక మృతి చెందిందని వివరించారు. పైగా ఇది పది రోజులుగా సరైన ఆహారం, నీరు తీసుకోకుండా ఉండటంతో బలహీనంగా ఉండటం, మూకుమ్మడి దాడి తట్టుకోలేక గాయాలతో మృతి చెందినట్లు స్పష్టం చేశారు. ఇటీవల నాటుబాంబు ఘటనలో కాలికి గాయమైన ఏనుగు సురక్షితంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం టేకుమంద రిజర్వు ఫారెస్టు పరిధిలో 14 ఏనుగులు ఒక గుంపుగా, మూడు ఏనుగులు మరో గుంపుగా, ఓ ఒంటరి ఏనుగు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటి కదలికలను నిత్యం పరిశీలిస్తున్నామని చెప్పారు. పలమనేరు రేంజ్‌లోని టేకుమంద రిజర్వు ఫారెస్టులో గవిని చెరువు, దేవరకొండలోని కుంటల్లో నీరు పుష్కలంగా ఉండటంతో ఏనుగులు తరచూ ఈ ప్రాంతానికి వస్తున్నాయని, ఇవి సమీప పొలాల్లోకి రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అటవీ సమీప ప్రాంతాల్లోని ప్రజలకు ఏనుగులు ద్వారా ఎలాంటి ప్రాణహాని జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, పంట నష్టం జరిగితే పరిహారం తప్పకుండా చెల్లిస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

పలమనేరులో నేడు 'పీజీఆర్ఎస్'

● జిల్లా కేంద్రంలో కార్యక్రమం రద్దు

చిత్తూరు అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలోని కౌన్సిల్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరుగుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి జేసీ విద్యాధరి వినతిపత్రాలను స్వీకరిస్తారన్నారు. పలమనేరులో పీజీఆర్ఎస్ ఉండటంతో జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తామని పేర్కొన్నారు.

కిశోరి వికాసం

● విద్య, వికాసం, సైబర్ నేరాలపై బాలికలకు అవగాహన కల్పించడమే ధ్యేయం

● వచ్చేనెల 10వ తేదీవరకు వివిధ అంశాలపై కార్యక్రమాలు



చిత్తూరు అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు సద్వినియోగం అయ్యేలా కిశోర బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించడానికి 'కిశోరి వికాసం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సామాజిక, విద్య, వైద్యం, క్రీడలు, చట్టాలపై వారికి అవగాహన కల్పించి ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించింది. జిల్లా మహిళా, స్త్రీ- శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వచ్చేనెల పదో తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయి.

షెడ్యూల్ ఇలా..

ఈనెల 2న అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పరిచయ కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. 6న రుతుక్రమ పరిశుభ్రత, లైంగిక విద్య, 9న బాల్య వివాహాలు, పునరుత్పత్తి, ఆరోగ్యం-ప్రభావాలు, 13న పిల్లల హక్కులు, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, పోక్సో చట్టం, 16న కౌమార దశలో రక్తహీనత, 20న లింగ అసమానత, ఆడపిల్లల పట్ల వివక్ష, 23న విద్య, కెరీర్‌పై సూచనలు, నైపుణ్య ప్రాముఖ్యతలు, 27న సైబర్ రక్షణ, ఆన్‌లైన్ భద్రత, 30న ఆర్థిక అంశాల నిర్వహణ, జూన్ 3న బాలికల నాయకత్వ లక్షణాలు, సాధికారత, 6న క్రీడలు, యోగా, వ్యాయామం, 10న బాల్య వివాహాల సమస్యలు-నిర్మూలన అంశాలపై అవగాహన కల్పిస్తారు.

కౌమార బాలికలకు..

జిల్లాలోని 12 ప్రాజెక్టుల పరిధిలో 2,420 అంగన్వాడీ కేంద్రాల ద్వారా టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థినులతోపాటు బడికి దూరంగా ఉన్న కౌమార బాలికలు మొత్తం 64,778 మందికి అవగాహన కల్పించాలని అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. వీరిలో.. 11-14 ఏళ్లలోపు 36,854 మంది, 15-18 ఏళ్లలోపు 27,924 మంది బాలికలను గుర్తించారు. ఎంపిక చేసిన అంశాలపై ఆయా ప్రాంతాల్లో బాలికలకు అనువైన సమయంలో గంటపాటు శిక్షణ ఇస్తారు.

కమిటీ ఏర్పాటు

కిశోరి వికాసం కోసం ఏర్పాటు చేసిన కమిటీలో గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో సర్పంచ్, కౌన్సిలర్లు కన్వీనర్లుగా ఉంటారు. మెంబర్లుగా పంచాయతీ సెక్రటరీ లేదా అడ్మిన్ సెక్రటరీ, వీఆర్వో, స్థానిక హెచ్ఎం, డ్వాక్రా సంఘం లీడర్, మహిళా వార్డు మెంబర్లు, ఏఎన్ఎంలు, ఎన్‌జీవో, అంగన్వాడీ వర్కర్లు ఉంటారు.

కమిటీ విధులు

గ్రామాల్లో ఈ కమిటీ కౌమార బాలికల డేటాను సేకరించి బృందాలుగా ఏర్పాటు చేసి సమావేశాన్ని నిర్వహిస్తుంది. వచ్చే నెల 10వ తేదీ వరకు జరిగే అన్ని కార్యక్రమాలను స్థానికంగా ఉన్న ప్రజా ప్రతినిధులతో పాటు ఎంపిక చేసిన రోజుల్లో ఆయా శాఖల సిబ్బంది, అనుభవజ్ఞులైన వారితో విద్యార్థినులకు ఆయా అంశాలపై అవగాహన కల్పిస్తారు.

9న షర్మిల రాక

చిత్తూరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ బలోపేతం చేయడంలో భాగంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నారని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రాజా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 9వ తేదీన మధ్యాహ్నం 3.30 గంటలకు చిత్తూరులో పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రేపు కలెక్టరేట్‌లో డీఆర్సీ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ (డీఆర్సీ) సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని వివేకానంద భవన్‌లో జరగనుంది. జిల్లాలోని వివిధశాఖల ద్వారా కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులు సమీక్ష నిర్వహిస్తారు. గతనెల 30న జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్ అధ్యక్షతన జరగాల్సిన సమావేశం ఆయన సూచన మేరకు ఈనెల ఆరో తేదీకి వాయిదా పడింది. సమావేశంలో కలెక్టర్ సుమిత్ కుమార్‌తోపాటు జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, ప్రత్యేక ఆహ్వానితులు, జిల్లా అధికారులు హాజరుకానున్నారు.



జన హృదయనేతకు జన్మదిన శుభాకాంక్షలు
HAPPY BIRTHDAY
నిగర్వి.. నిరాడంబరుడు..
జన హృదయనేత.. అనునిత్యం
ప్రజాసేవకై పరితపించే నాయకులు
వి.కోట అభివృద్ధికై నిత్యం పరిశ్రమించే
నిస్వార్థ ప్రజాసేవకులు తెలుగుదేశం పార్టీ
సీనియర్ నాయకులు
గౌ॥ శ్రీ సి. రామచంద్రనాయుడు గారికి
హార్ధిక జన్మదిన శుభాకాంక్షలు.
ఆ కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి
ఆశీస్సులతో.. ఆయన ఇంకా మరెన్నో
జన్మదిన వేడుకలు జరుపుకోవాలని
ఆకాంక్షిస్తూ...
శ్రీ సి.రామచంద్రనాయుడు గారు
ఏ.ఎం.సి. మాజీ చైర్మన్, వి.కోట
శ్రీ ఎన్.అమరనాథ రెడ్డి గారు
మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే, పలమనేరు
వి.కోట మండల తెలుగుదేశం పార్టీ ఆత్మీయ కుటుంబ సభ్యులు
ఎ.ఎం. రంగనాథ్ మండల పార్టీ అధ్యక్షులు
బి.ఆర్. రాంబాబు జిల్లా అధికార ప్రతినిధి
జి.ఎం.సుబ్బన్న మాజీ మండల ఉపాధ్యక్షులు
ఈశ్వర్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి
ఆర్. ధీరజ్ (PMR) మండల తెలుగు యువత అధ్యక్షులు
కె.ఆర్.శభరీష్ జిల్లా యువత కార్యవర్గ సభ్యులు
ఎం.సోమశేఖర్ మండల మాజీ కార్యదర్శి
పి.నాగభూషణం నియోజకవర్గ బి.సి. సెల్ అధ్యక్షులు
ఎం.జె. చంద్రశేఖర్ రెడ్డి Ex. RESCO డైరెక్టర్
శివకుమారి తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు
హరినాథరెడ్డి యూనిట్ ఇన్‌చార్జి
విశ్వనాథరెడ్డి మండల తెలుగు రైతు అధ్యక్షులు
షణ్ముగం మండల వాణిజ్య విభాగం మాజీ కార్యదర్శి
ఎ.ఆర్. నాగరాజ్ మండల బీసీసెల్ ఉపాధ్యక్షులు, కాంట్రాక్టర్
డి.ఎన్. కుమార్ మండల ఓబిసిసెల్ అధ్యక్షులు
బి.ఆర్. సతీష్‌నాయుడు మాజీ సర్పంచ్
రామ్మూర్తి ఆచ్చారి మాజీ ఎంపిటిసి
ఎం.సి. కృష్ణప్ప మాజీ ఎంపిటిసి
భక్తవత్సలం మాజీ ఎంపిటిసి
షేక్ ఉమ్మర్ మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి
నాసిర్ మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు
రెడ్డి భాస్కర్ కె.ఆర్.పి. ట్రావెల్స్
జి.ఎం.ఆర్.భాస్కర్ మండల టిడిపి సీనియర్ నాయకులు
నారాయణ స్వామి మాజీ ఎంపిటిసి
వెంకటరామప్ప ఎ.ఎం.సి. మాజీ డైరెక్టర్
శంకరప్ప కాంట్రాక్టర్, సీనియర్ టిడిపి నాయకులు
జనార్ధన్‌రెడ్డి జిల్లా తెలుగుయువత కార్యదర్శి యూనిట్ ఇన్‌చార్జి
కోదండరెడ్డి ఐటిడిపి మండల అధ్యక్షులు యూనిట్ ఇన్‌చార్జి
కేశవరెడ్డి యూనిట్ ఇన్‌చార్జి
కె. సురేంద్ర వాణిజ్య విభాగం మండల అధ్యక్షులు
రామచంద్ర టిడిపి సీనియర్ నాయకులు కొంగాటం
చంద్రబాబు టీడీపీ సీనియర్ నాయకులు దానమయ్యగారిపల్లె
పి. ప్రకాష్ మండల తెలుగుయువత
సాదాత్ టీడీపీ సీనియర్ మైనారిటీ నాయకులు, వి.కోట
ఎస్.కె. ఇక్బాల్ సీనియర్ టిడిపి మైనార్టీ నాయకులు
చంద్రశేఖర్ మాజీ సర్పంచ్, ముదరందొడ్డి
దామోదర్ టిడిపి సీనియర్ నాయకులు
వెంకటరమణ నెర్నపల్లి మాజీ యూత్ పార్టీ అధ్యక్షులు
రామప్పశెట్టి టిడిపి సీనియర్ నాయకులు
దామోదర్ సర్పంచ్, ముదరందొడ్డి
నేతాజీ గోనుమాకులపల్లి పార్టీ అధ్యక్షులు
వెంకటేశ్ గోనుమాకులపల్లి పార్టీ కార్యదర్శి
ఎం.శివ టిడిపి సీనియర్ నాయకులు
సతీష్ తెలుగుయువత దాసార్లపల్లె
అమరేంద్ర తెలుగుయువత పత్రపల్లె
నరేష్ తెలుగుయువత దాసార్లపల్లె
చందు తెలుగు యువత గంధారమాకులపల్లె
పరశురాం నాయుడు రిటైర్డ్ హెచ్.ఎం.
ఇక్బాల్ తెలుగుయువత మైనార్టీనాయకులు
నంద తెలుగుయువత

జనసేనలో 20 మంది యువకుల చేరిక



జనసేనలో చేరిన యువకులతో నరేష్

కుప్పం, మే 4 (ఆంధ్రజ్యోతి): జనసేనలోకి ఆదివారం 20 మంది యువకులు చేరినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేష్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో యువకులను పార్టీ కండువాలు కప్పి ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం మండలం అడవిబూదుగూరు గ్రామానికి చెందిన 20 మంది యువకులు జనసేన పార్టీ ఆశయాలు, అధినేత పవన్ కల్యాణ్ దార్శనికతను చూసి తమ పార్టీలో చేరారని చెప్పారు. త్వరలో రానున్న స్థానిక ఎన్నికల్లో ఎన్డీయే నాయకులకు మద్దతుగా జనసైనికులు పని చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.

37 మంది కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న నేత్ర వైద్యులు మురళీ

పలమనేరు, మే 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో చెన్నై శంకర నేత్రాలయ నేత్రవైద్యులు మురళీ 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 37 మందికి ఆపరేషన్లు అవసరమైనట్లు గుర్తించారు. ఆపరేషన్లు చేసుకునే వారికి ఉచితంగా చెన్నై శంకర నేత్రాలయలో ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని.. ఉచిత వాహన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.

విగ్రహ ఏర్పాటుకు కమిటీ ఏకగ్రీవం


నూతనంగా ఎన్నికైన మండల కమిటీ సభ్యులు

సోమల, మే 4 (ఆంధ్రజ్యోతి): సోమలలో శ్రీకృష్ణదేవరాయల మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమల మార్కెట్ యార్డు వద్ద శ్రీకృష్ణదేవరాయల బలిజ సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలికిరి-తిరుపతి క్రాస్ రోడ్డులోని సర్కిల్‌లో శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసి పూజలు నిర్వహించారు. అలాగే విగ్రహ ఏర్పాటుకు మండల స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎన్. మునివెంకటప్ప (జిల్లా బీసీ వెల్ఫేర్ విశ్రాంత అధికారి), కోశాధికారిగా కర్రి జ్యోతీశ్వరుడు, ఉపాధ్యక్షులుగా ఎ.నవీన్ (ఎగువపల్లె), ఎస్‌వీ. రమణ (పొదలగుంట్లపల్లె), గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ హరినారాయణలను ఎంపిక చేశారు. మండలంలోని 15 పంచాయతీల నుంచి ఉపాధ్యక్షులను ఎంపిక చేశారు. అనంతరం ఎన్నికైన కమిటీ సభ్యులను సన్మానించారు. విగ్రహ ఏర్పాటుకు సీఎం.సురేష్ రూ.2,00,116, బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జి మదన్ మోహన్‌బాబు రూ.1,00,116, జీసీకే ప్రసాద్ రూ.1,00,116 విరాళాన్ని మండల కమిటీకి అందజేశారు. సమావేశంలో బలిజ సంఘ నాయకులు వై.సాంబయ్య, వెంకట్రామయ్య, కామిశెట్టి నగేష్, వీవీ. రమణ, శ్రీరాములు, సాంబశివయ్య, సదాశివయ్య, వై.ఎస్. మునిరత్నం, జగన్‌మోహన్, శివరామయ్య, కర్రి వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ బ్యాటర్‌గా కళ్యాణి



బెస్ట్ బ్యాటర్‌గా అవార్డును గెలుచుకున్న అప్పినేపల్లెకు చెందిన కళ్యాణితో క్రీడాకారులు

చౌడేపల్లె, మే 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జేటీఎస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో పలు కంపెనీల మహిళా క్రీడాకారులతో జరిగిన క్రికెట్ పోటీల్లో చౌడేపల్లె మండలంలోని అప్పినేపల్లెకు చెందిన ఉద్యోగి కళ్యాణి బెస్ట్ బ్యాటర్‌గా ఆదివారం అవార్డు అందుకున్నారు. బోయకొండ గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్ శివప్పనాయుడు కుమార్తె కళ్యాణి ఉత్తమ ప్రతిభ కనబరిచి బెస్ట్ బ్యాటర్ అవార్డు గెలుచుకోవడంతో కళ్యాణిని మాజీ ఎమ్మెల్సీ రెడ్డప్ప, మాజీ న్యాయమూర్తి స్వర్ణలత, పలువురు న్యాయవాదులు అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే క్షేత్రస్థాయి పర్యటనలు

కుప్పం, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం కుప్పం నియోజకవర్గంలో వారానికి రెండు రోజులపాటు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయనున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, డాక్టర్ సురేష్‌బాబులతో కలిసి నాలుగు మండలాలలోని గ్రామాల్లో పర్యటించి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి అక్కడికక్కడే పరిష్కార మార్గాలు చూపుతామన్నారు. ప్రతి మంగళ, శుక్ర వారాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పర్యటనలు ఉంటాయన్నారు. తనతో పాటు ఆయా ప్రభుత్వ విభాగాల డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని చెప్పారు. ఈ పర్యటనల్లో ఆయా మండలాల అధ్యక్షులు పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. పర్యటన వివరాలను రెండు రోజులముందే అధికారులకు తెలియజేస్తామని కడా పీడీ తెలిపారు.

గిరిజన గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

రామకుప్పం, మే 4 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మిట్టపల్లె వద్ద ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలో మూడో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు వార్షిక ఆదాయం లక్షలోపు ఉండాలన్నారు. మే నెల 20వ తేదీన లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు 8500968128 ను సంప్రదించాలని కోరారు.

నేటి గ్రీవెన్స్ డే రద్దు

కుప్పం, మే 4 (ఆంధ్రజ్యోతి): కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల వేదిక అనివార్య కారణాలతో రద్దయినట్లు కడా కార్యాలయ అధికారులు తెలతిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు.

అమ్మవారి సేవలో శ్రీహరిరావు



చౌడేపల్లె, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మను రాష్ట్ర వైద్య మండలి చైర్మన్ శ్రీహరిరావు దర్శించుకున్నారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా అమ్మవారి దర్శనం కోసం రాగా ఆలయ అధికారులు వారికి అమ్మవారి దర్శనం కల్పించి శాలువలతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

కీలపట్లలో విద్యుత్తు సమస్యలు దూరం

పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి


ట్రాన్స్‌ఫార్మర్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గంగవరం, మే 4 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల నుంచి కీలపట్ల వాసులను వెంటాడుతున్న విద్యుత్తు సమస్యలు దూరమయ్యాయని.. రూ.60 లక్షలతో నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగిందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కీలపట్ల కోనేటిరాయస్వామిని దర్శించుకుని గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కీలపట్ల ప్రజలు, రైతులు దశాబ్దాలుగా కరెంటు సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని.. సమస్యను గ్రామస్తులు తన దృష్టికి తీసుకురావడంతో ప్రభుత్వం నుంచి రూ.60 లక్షల నిధులతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దీంతో కీలపట్లలో లోఓల్టేజీ లేకుండా సమస్య తలెత్తకుండా నిరంతరాయంగా త్రీఫేస్ కరెంటును సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఇప్పుడు ప్రారంభించిన ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యంతో కీలపట్ల వాసులు చిన్న చిన్న పరిశ్రమలను స్థాపించడానికి దోహదపడుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏడీఈ చిన్నబ్బ, మండల టీడీపీ అధ్యక్షులు సోమశేఖర్‌గౌడ్, సర్పంచ్ చంద్రశేఖర్, ప్రతాప్‌రెడ్డి, వేణు, గిరిధర్‌గోపాల్, రాము, శీనప్ప, శ్రీనివాసులు, జనసేన చంద్ర, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

భక్తజన సంద్రం.. బోయకొండ

- గంగమ్మను దర్శించుకున్న 40 వేల మంది భక్తులు
- సాయంత్రం వరకు కొనసాగిన రద్దీ
- సేవా టికెట్లతో ఒక్కరోజు ఆదాయం రూ.12 లక్షలు




చౌడేపల్లె, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం భక్తజనసంద్రంగా మారింది. గంగమ్మ తల్లి నామస్మరణతో మార్మోగింది. వేకువజామున ఆలయ అర్చకులు అమ్మవారిని శుప్రభాత సేవతో మేల్కొలిపి అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని స్వర్ణాభరణాలు, ప్రత్యేక పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వేసవి సెలవులు ప్రారంభం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 40 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. వివిధ సేవా టికెట్ల ద్వారా ఒక్కరోజుకే రూ.12 లక్షల ఆదాయం సమకూరింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

గ్రంథాలయం అభివృద్ధికి సభ్యత్వ నమోదు


సమాజానికి బహిరంగలేఖ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్.మాధవ్ తదితరులు

పలమనేరు, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయం అభివృద్ధికి పుస్తకాల సేకరణతో పాటు , గ్రంథాలయ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంల చేపడుతున్నట్లు పలమనేరు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు ఆర్.మాధవ్ అన్నారు. ఆదివారం పలమనేరు శాఖా గ్రంథాలయంలో రచయితల సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సదస్సులో గ్రంథాలయాల అభివృద్ధికి గ్రంథాలయాల్లో పాఠకుల సంఖ్యను, పత్రికలు, పుస్తకాల సంఖ్యను పెంచడానికి తీసుకోవాల్సి చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రచయితలు, ఎల్ఐసీ విశ్రాంత ఉద్యోగి యుగంధర్‌బాబు, జనవిజ్ఞాన వేదిక నాయకులు గిరిధరమూర్తి, రైతు నాయకులు ఉమాపతినాయుడు, రసజ్ఞుల సమాఖ్య అధ్యక్షులు శ్రీపురం సీతారామయ్య, గ్రంథాలయ అధికారి హేమంత్‌కుమార్ సభ్యత్వ రుసుం అందజేశారు. గ్రంథాలయానికి సాహిత్య పత్రికలను పంపిణీ చేసేందుకు రూ.5 వేలు చందాను విరాళంగా చెల్లించిన బైరెడ్డిపల్లి మహతి ఫౌండేషన్ వారికి రచయితలు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమనేత, రచయిత మంచికంటి గ్రంథాలయ వికాసానికి చేపట్టాల్సిన చర్యలపై 'సమాజానికి బహిరంగ లేఖ ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత శ్రీరామచంద్రమూర్తి, చంద్రశేఖరయ్య, డాక్టర్ జయవర్ధన్ పాల్గొన్నారు.

మతాంతర వివాహం చేసుకుందని అక్కపై చెల్లి దాడి

బంగారుపాళ్యం, మే 4 (ఆంధ్రజ్యోతి): మతాంతర వివాహం చేసుకున్న అక్కపై చెల్లి దాడి చేసిన సంఘటన బంగారుపాళ్యం మండలంలోని కాటప్పగారిపల్లెలో జరిగింది. ఎస్‌ఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. కాటప్పగారిపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు రాజశేఖర్ పలమనేరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అదే కాలేజీలో పలమనేరుకు చెందిన మునీష్ బాషా కుమార్తె చాందినీ కూడా ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. వీరిద్దరూ ప్రేమించుకున్నారు. మరోవైపు చాందినీకి పెళ్లిచూపులు జరిగాయి. ఈ క్రమంలో రాజశేఖర్, చాందినీలు మార్చి 28వ తేదీన ఓ అమ్మవారి గుడిలో పెళ్లి చేసుకున్నారు. వీరు ఏప్రిల్ రెండో తేదీన ఎస్పీని కలిసి రక్షణ కల్పించాలని కోరారు. ఎస్పీ ఆదేశాలతో బంగారుపాళ్యం పోలీసులు ఇరు కుటుంబాలను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. ఈ నేపథ్యంలో మతాంతర వివాహం చేసుకుందని చాందినీ చెల్లెలు తస్మీయా కోపం పెంచుకుంది. ఆమె ఆదివారం కాటప్పగారిపల్లెకు చేరుకుని అక్క, బావలపై తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేయగా.. వారిద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. రాజశేఖర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

డాక్టర్ చీటీ లేకుండా మందులు విక్రయిస్తే చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాయుడు

పుంగనూరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ చీటీ లేకుండా మాత్రలు, మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పుంగనూరు సీఐ సుబ్బరాయుడు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో మెడికల్ షాపుల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మెడికల్ షాపుల్లో యువత మత్తుకు సంబంధించిన మందులు, మాత్రలు విక్రయించడంతో వారు చెడుమార్గంలో నడుస్తున్నట్లు సూచించారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం మేలుపట్లలోని ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ పార్వతి కోరారు. 3 నుంచి తొమ్మిదో తరగతి వరకు బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్‌నంబర్లు 7337234790, 9177216561 లను సంప్రదించాలని కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన

బైరెడ్డిపల్లె, మే 4 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులచే నిర్వహించిన ఉచిత కంటివైద్యశిబిరానికి స్పందన లభించింది. 47 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గురువులతో పూర్వవిద్యార్థులు

బైరెడ్డిపల్లె, మే 4 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 1992-93 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఆనాటి ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అప్పట్లో పాఠశాలలో గడిపిన తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ తమ స్నేహితులతో కలిసి సరదాగా గడిపారు.

యాళి వాహనంపై మృత్యుంజయేశ్వరస్వామి విహారం


యాళివాహనంపై ఊరేగుతున్న స్వామివారు

చౌడేపల్లె, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో మూడోరోజు యాళి వాహనంపై స్వామి వారు ఊరేగారు. ఆదివారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ రాజశేఖర్ దీక్షితులు, కుమారస్వామి, మహేష్ దీక్షితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి యాళి వాహనంపై ఉత్సవ మూర్తులను అధిష్ఠింపజేసి ప్రత్యేకంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలు, చెక్క భజనల నడుమ పుర వీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు కర్పూర హరతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులుగా ఆశోక్, సుదర్శన కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

దిన్నెగంగమ్మకు పూజలు



రొంపిచెర్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం కమ్మోళ్లపల్లెలోని గ్రామదేవత దిన్నె గంగమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. అమ్మవారికి అభిషేకాలు చేశారు. మహిళలు బోనాలు చెల్లించి, చీర సారెలతో పూజలు నిర్వహించారు. పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, గ్రామపెద్దలు సామిరెడ్డి, వెంకట్రమణారెడ్డి, చంద్రారెడ్డి, మదనమోహన్‌రెడ్డి, అమరనాధరెడ్డి, కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోయకొండలో బాలుడిపై కుక్క దాడి



చౌడేపల్లె, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో ఆదివారం బాలుడిపై కుక్క దాడి చేసి గాయపరిచింది. ఆదివారం తిరుపతికి చెందిన ఫణి (10) తల్లిదండ్రులతో కలిసి అమ్మవారి దర్శనం కోసం బోయకొండకు వచ్చాడు. ఆలయ ప్రధాన కార్యాలయం వద్ద ఉండగా ఓ కుక్క బాలుడిపై దాడి చేసింది. అయితే చికిత్సల కోసం బోయకొండలో వెతికినా వైద్య సిబ్బంది అందు బాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చేసేది లేక ఆలయ కార్యాలయంలో ఉన్న కార్మికులు పసుపు తెచ్చి కుక్క కరచిన చోట రక్తం రాకుండా పెట్టారు. ఏమీ చేయలేక చౌడేపల్లె సీహెచ్‌సీకి వెళ్లి చికిత్సలు చేయించుకుని తిరుపతికి వెళ్లారు. నిత్యం వేలాది మంది భక్తులు తరలివచ్చే పుణ్యక్షేత్రంలో వైద్యులు అందుబాటులో లేకపోవడం ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఆలయ అధికారులు, దేవదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి భక్తుల కోసం వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

పోగొట్టుకున్న ఉంగరం భక్తుడికి అందజేత

రామకుప్పం, మే 4 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివారులోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పోగొట్టుకున్న ఉంగరాన్ని భక్తుడికి అందజేశారు. శాంతిపురం మండలం దండికుప్పానికి చెందిన ప్రవీణ్ గత నెల 30న సుబ్రహ్మణ్యస్వామి దర్శనం కోసం ఆలయానికి వచ్చి ఉంగరం పోగొట్టుకున్నాడు. ఆలయాన్ని శుద్ధి చేస్తుండగా పురోహితుడు వాసుకు ఉంగరం దొరికింది. ఉంగరాన్ని పురోహితుడు ఆలయ అభివృద్ధి కమిటీ పెద్దలు సీతాపతికి అప్పగించారు. ఆదివారం ఆలయ పురోహితులు పోలీసుల సమక్షంలో ఉంగరాన్ని ప్రవీణ్‌కు అందజేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గంగవరం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిపల్లి గ్రామ సమీపంలోని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు... నడింపల్లె సమీపంలోని పంటపొలాల వద్ద ఓ వ్యక్తి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు రెండు రోజుల క్రితం మృతిచెంది ఉంటాడని, 58 ఏళ్ల వయస్సు ఉంటుందని. మృతుడి వివారాలు తెలిస్తే ఫోన్‌నంబరు 9440796735 కు సమాచారం అందించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్ తెలిపారు.

ఉగ్రదాడులకు నిరసనగా ర్యాలీ


శవయాత్ర చేస్తున్న హిందూ కులసంఘాల ఐక్యవేదిక సభ్యులు

పుంగనూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): కశ్మీరులోని పహల్గాం ఉగ్రదాడులకు పాల్పడిన, వారికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పుంగనూరు హిందూ కుల సంఘాల ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జమీందారీ ప్యాలెస్ నుంచి నాగపాళ్యం, ఇందిరాసర్కిల్, ప్రవేటు బస్టాండ్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఫొటోలను శవయాత్రగా నిరసన ర్యాలీ చేశారు.

గురుకులం ప్రవేశ పరీక్ష

సదుం, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులంలో ఇంటర్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. 126 మంది పరీక్షలకు హాజరైనట్లు డిపార్టుమెంటల్ ఆఫీసర్ జ్యోత్స్న తెలిపారు.



భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

చవటగుంటలో ముగిసిన మహాభారత ఉత్సవాలు



చవటగుంటలో ద్రౌపది అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, అమ్మవారి విగ్రహంతో అగ్నిగుండ ప్రవేశం

వెదురుకుప్పం, మే 4 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం చవటగుంట మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ఆవరణంలో భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. ద్రౌపది అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారి విగ్రహాన్ని ఎత్తుకుని అగ్నిగుండ ప్రవేశం చేశాక భక్తులు చేశారు. దీంతో మహాభారత ఉత్సవాలు ముగిశాయి. అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమానికి కాపుమొండివెంగనపల్లె గ్రామస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. కాగా రాత్రి భక్తులకు కాపుమొండివెంగనపల్లెకు చెందిన పార్వతమ్మ, రామమూర్తి ఆచారి, కళాంజలి, తిరుమలచారి అన్నదానం చేశారు.

అలరించిన దుర్యోధన వధ




తలపడుతున్న భీమ, దుర్యోధన వేషధారులు

చవటగుంట మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో దుర్యోధన వధ ఘట్టం అలరించింది. ఆలయ ఆవరణంలో దుర్యోధనుడి మట్టి బొమ్మ తయారీ చేశారు. దానిపై భీముడు, దుర్యోధనుడి వేషధారులు దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. వేసవి కావడం ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల షామియానాలు వేసి.. వాటి కింద దుర్యోధన వధ ఘట్టాన్ని చేపట్టారు.

ధర్మరాజుల వారి పట్టాభిషేకం

దుర్యోధన వధ ఘట్టం ముగిశాక అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆ తర్వాత ధర్మరాజుల వారి పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయదారులుగా వెదురుకుప్పం భారతంమిట్టకు చెందిన నందకుమారి, గీతాకుమారి వ్యవహరించారు.

వైభవంగా పల్లకీ ప్రదక్షిణ సేవ



మాడవీధుల్లో ఊరేగుతున్న ద్రౌపదీ సమేత పాండవుల ఉత్సవర్లు

రాత్రి ద్రౌపది అమ్మవారి పల్లకీ ప్రదక్షిణ సేవ కార్యక్రమాన్ని నిర్వహించి నాలుగు మాడ వీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళీ ఉభయదారుగా వ్యవహరించారు. కాగా, ద్రౌపది అమ్మవారిని సత్యవేడు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ దర్శించుకున్నారు.

కార్వేటినగరం మండలంలో..

కార్వేటినగరం మండలం అమ్మపల్లె మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ జరిగింది. ఈ క్రమంలో ఆలయ ఆవరణంలో దుర్యోధన మట్టిబొమ్మను తయారీ చేసి షామియానాలు వేసి వాటికింద ఆ ఘట్టాన్ని పూర్తి చేశారు. ఆలయంలో ద్రౌపది అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే ధర్మరాజుల వారి పట్టాభిషేక మహోత్సవం జరిగింది. ఆదివారం రాత్రి భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేయడంతో ఉత్సవాలు ముగిశాయి.

బెస్ట్ బ్యాటర్‌గా కళ్యాణి



చౌడేపల్లె, మే 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులోని జేటీఎస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో పలు కంపెనీల మహిళా క్రీడాకారులతో జరిగిన క్రికెట్ పోటీల్లో చౌడేపల్లె మండలంలోని అప్పినేపల్లెకు చెందిన ఉద్యోగి కళ్యాణి బెస్ట్ బ్యాటర్‌గా ఆదివారం అవార్డు అందుకున్నారు. బోయకొండ గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్ శివప్పనాయుడు కుమార్తె అయిన కళ్యాణి అవార్డు అందుకోవడంతో ఆమెను మాజీ ఎమ్మెల్సీ రెడ్డెప్ప, మాజీ న్యాయమూర్తి స్వర్ణలత, పలువురు న్యాయవాదులు అభినందించారు.

శ్రీదుర్గ మృతి బాధాకరం

● టీడీపీకి తీరని లోటు: మంత్రి కొల్లు రవీంద్ర



శ్రీదుర్గ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

చిత్తూరు సెంట్రల్, మే 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా మహిళా కార్యదర్శి శ్రీదుర్గ మృతి బాధాకరమని, పార్టీకి తీరని లోటని రాష్ట్ర ఎక్సైజ్, మైన్స్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం చిత్తూరు వచ్చిన ఆయన.. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఎమ్మెల్యే జగన్మోహన్‌తో కలిసి సంతపేటలోని టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ షణ్ముగం గృహానికి వెళ్లి ఆయన కుమార్తె శ్రీదుర్గ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. మంత్రి మాట్లాడుతూ.. వైద్య సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఘటనపై విచారణ జరిపించాక అపోలో లీజుపై చర్యలు చేపట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చిస్తామని స్పష్టం చేశారు. దీంతోపాటు 'అపోలో వద్దు ప్రభుత్వ ఆస్పత్రి ముద్దు' అనే నినాదంతో చేపట్టిన ప్రజా దండయాత్ర సంతకాల సేకరణ కార్యక్రమానికి ఆయన మద్దతు తెలిపారు.

మంత్రికి సన్మానం

మంత్రి రవీంద్ర ఆదివారం టీడీపీ జిల్లా కార్యాలయానికి రాగా.. సీఆర్ రాజన్, ఎమ్మెల్యే జగన్మోహన్ సన్మానించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, సీనియర్ నాయకులు చంద్రప్రకాష్, శ్రీధర్, మోహన్‌రాజ్, త్రిమూర్తి, కాజూరు బాలాజీ, వసంత్‌కుమార్, జయచంద్రనాయుడు, మేషక్, విజయ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు భగీరథ మహర్షి



భగరీథ మహర్షి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఏవో కులశేఖర్

చిత్తూరు అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): గంగను భువికి తెచ్చిన మహనీయుడు భగీరథ మహర్షి అని కలెక్టరేట్ ఏవో కులశేఖర్ చెప్పారు. భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్‌హాలులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ ఇన్‌చార్జి డీడీ మునీంద్రయ్య, సాంఘిక సంక్షేమశాఖ సహాయ అధికారి నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

7న సత్యవేడుకు మంత్రి లోకేశ్?

సత్యవేడు, మే 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ ఈనెల 7న సత్యవేడుకు రానున్నట్లు సమాచారం. సత్యవేడులో జరగనున్న టీడీపీ సమన్వయ సమావేశానికి హాజరవుతారని తెలిసింది. ఇటీవల పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదులో ముందు వరుసలో నిలిచిన పార్టీ నేతలు, కార్యకర్తలతో లోకేశ్ భేటీ కానున్నారని సమాచారం. ఈ మేరకు లోకేశ్ పర్యటన విజయవంతం చేసేందుకు కూటమి నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యకర్తలతో లోకేశ్ సమావేశమయ్యేందుకు స్థానిక వారపు సంత వద్ద స్టేజీ ఏర్పాటు చేస్తున్నారు. లోకేశ్ పర్యటన నేపథ్యంలో శాప్ చైర్మన్ రవినాయుడు ఆదివారం సత్యవేడుకు చేరుకుని స్థానిక నేతలతో చర్చించారు. లోకేశ్ కార్యకర్తల సమావేశం అనంతరం రాత్రి సత్యవేడులోనే బస చేసి, 8వ తేదీ ఉదయం శ్రీసిటీలో జరగనున్న ఎల్‌జీ పరిశ్రమ భూమిపూజలో పాల్గొంటారని సమాచారం. లోకేశ్ పర్యటనపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

26 ఎర్రచందనం దుంగల స్వాధీనం



మంగళం, మే 4(ఆంధ్రజ్యోతి) : మామండూరు నార్త్ బీట్‌లో ఆదివారం తెల్లవారుజామున అటవీశాఖ అధికారులు 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు తెల్లవారు జామున తిరుపతి-కడప మార్గంలోని మామండూరు వద్ద అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వేగంగా ఓ కారు రావడాన్ని గమనించి ఆపేందుకు ప్రయత్నించారు. కారు ఆపకుండా వేగంగా వెళ్లిపోవడంతో వెంబడించారు. స్మగ్లర్లు అంజనేయపురం చెక్‌పోస్టు వద్ద కారును వదలి పారిపోయినట్లు తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వాహనాన్ని పరిశీలించగా 26 ఎర్రచందనం దుంగలు దొరికాయని వెల్లడించారు. వీటి బరువు 332 కిలోలు ఉంటాయని, పారిపోయిన స్మగ్లర్ల కోసం గాలిస్తున్నామని అన్నారు. ఈ దాడుల్లో మామండూరు సెక్షన్ డీఆర్వో గౌస్ కరీం, ఎఫ్‌బీవోలు శరవణకుమార్, జాన్ శ్యాముల్, ప్రొటెక్షన్ వాచర్స్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తజన సంద్రం.. బోయకొండ

● గంగమ్మను దర్శించుకున్న 40వేల మంది భక్తులు ● సాయంత్రం వరకు కొనసాగిన రద్దీ

● సేవా టికెట్లతో ఒక్కరోజు ఆదాయం రూ.12 లక్షలు





ప్రత్యేక అలంకరణలో బోయకొండ గంగమ్మ, క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

చౌడేపల్లె, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. గంగమ్మ తల్లి నామస్మరణతో మార్మోగింది. వేకువజామున ఆలయ అర్చకులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని స్వర్ణాభరణాలు, ప్రత్యేక పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వేసవి సెలవులు ప్రారంభం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 40వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. వివిధ సేవా టికెట్ల ద్వారా ఒక్కరోజుకే రూ.12 లక్షల ఆదాయం సమకూరింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

బోయకొండలో బాలుడిపై కుక్క దాడి



గాయపడిన బాలుడు ఫణి

చౌడేపల్లె, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో ఆదివారం బాలుడిపై కుక్క దాడి చేసి గాయపరిచింది. ఆదివారం తిరుపతికి చెందిన ఫణి (10) తల్లిదండ్రులతో కలిసి అమ్మవారి దర్శనం కోసం బోయకొండకు వచ్చాడు. ఆలయ ప్రధాన కార్యాలయం వద్ద ఉండగా ఓ కుక్క బాలుడిపై దాడి చేసింది. అయితే చికిత్సల కోసం బోయకొండలో వెతికినా వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చేసేది లేక ఆలయ కార్యాలయంలో ఉన్న కార్మికులు పసుపు తెచ్చి కుక్క కరచిన చోట రక్తం రాకుండా పెట్టారు. ఏమీ చేయలేక చౌడేపల్లె సీహెచ్‌సీకి వెళ్లి చికిత్సలు చేయించుకుని తిరుపతికి వెళ్లారు. నిత్యం వేలాది మంది భక్తులు తరలివచ్చే పుణ్యక్షేత్రంలో వైద్యులు అందుబాటులో లేకపోవడం ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఆలయ అధికారులు, దేవదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి బోయకొండలో భక్తుల కోసం వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

30 ఏళ్ల తర్వాత గంగజాతర

● టీకేఎంపురంలో భక్తిశ్రద్ధలతో మొదలైన సంబరాలు





పొంగళ్లు తీసుకెళుతున్న మహిళలు, అంబళ్లు పోస్తున్న మహిళలు


వెదురుకుప్పం, మే 4 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం టీకేఎంపురంలో గంగజాతర సంబరాలు ఆదివారం మొదలయ్యాయి. విశేషమేమంటే ఈ గ్రామంలో 30 ఏళ్ల క్రితం వరకు గంగజాతర ఉత్సవాలు జరుగుతూ వచ్చాయి. ఆ తర్వాత జాతర జరగకుండా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో మళ్లీ ప్రస్తుతం ఆ గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో గంగజాతర ముందుకు రావడంతో జాతర ప్రారంభమైంది. ఈ క్రమంలో మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గంగవరం, మే 4 (ఆంధ్రజ్యోతి): నడిపల్లె గ్రామ సమీపంలోని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగవరం మండలంలోని నడింపల్లె సమీపంలోని పంటపొలాల వద్ద ఓ వ్యక్తి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు రెండు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని, 58 ఏళ్ల వయస్సు ఉంటుందని. మృతుడి వివారాలు తెలిస్తే ఫోన్ నెంబరు 94407 96735కు సమాచారం అందించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్ తెలిపారు.

తిరుమల ఘాట్‌రోడ్లకు మహర్దశ

● రూ.10.75 కోట్లతో పనులకు టీటీడీ ప్రణాళిక



తిరుమల, మే4(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్ రోడ్ల మరమ్మతులపై టీటీడీ దృష్టి సారించింది. రూ.10.75 కోట్లతో అభివృద్ధి చేయాలని సంకల్పించింది. తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డు 17 కిలోమీటర్లు, తిరుమల నుంచి తిరుపతి చేరుకునే మొదటిఘాట్‌రోడ్డు 18 కిలోమీటర్ల పొడవుతో ఉంటాయి. భక్తు రద్దీ నేపథ్యంలో రోజూ 10 వేల వాహనాలు ఈ మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నాయి. లారీలు, టిప్పర్లు కూడా తిరుగుతుంటాయి. దీంతో తరచూ ఘాట్ రోడ్లు దెబ్బతింటున్నాయి. చివరిగా 2021 జనవరిలో కొత్త రోడ్లు(బీటీ రెన్యూవల్ కోట్) వేశారు. అయితే కొవిడ్ తర్వాత వాహనాల సంఖ్య పెరిగింది. 2021 నవంబరు, డిసెంబరు నెలల్లో భారీ వర్షాలు, డ్రైనేజి, క్రాష్‌బ్యారియర్ వంటి పనులతో ఘాట్‌రోడ్లు భారీగా దెబ్బతిన్నాయి. అనేక ప్రాంతాల్లో గుంతలు ఏర్పడ్డాయి.

వర్షాకాలం రాకముందే పూర్తి

భక్తులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని టీటీడీ అధికారులు ఘాట్‌రోడ్లలో మళ్లీ మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. బిట్యూమినస్ కాంక్రీట్, బిట్యూమినస్ మెకాడమ్, హాట్ అప్లైడ్ థర్మోప్లాస్టిక్ కంపౌండ్ వంటి పనులతో పాటు రైజ్డ్ పేవ్‌మెంట్ మార్కర్లు(రోడ్ స్టడ్స్), సైన్‌బోర్డులు వంటిని ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించింది. వర్క్స్ కమిటీ కూడా మరింత అధ్యయనం చేపట్టి చర్యలు తీసుకోవాలని సూచించింది. వర్షాకాలం రాకముందే ఈపనులు ప్రారంభించేలా టెండర్లను ఆహ్వానించేందుకు టీటీడీ సిద్ధమవుతోంది.

చిత్తూరు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై

చర్యలకు ప్రభుత్వ ఆదేశం

● స్టే తెచ్చుకున్న చిన్నయ్య

చిత్తూరు అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య శాఖలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై పనిచేస్తూ సూళ్లూరుపేట మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా పనిచేస్తున్న చిన్నయ్యపై చర్యలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వివరాలిలా.. చిత్తూరు నగరపాలక సంస్థలో తొలి నియామకం, అనంతరం ప్రజారోగ్యశాఖ ఇన్‌స్పెక్టర్‌గా పొందిన పదోన్నతులు అక్రమంగా తెచ్చుకున్నట్లు అందిన ఫిర్యాదులపై విచారణ జరిగింది. విచారణ సభ్యుల నివేదిక ఆధారంగా కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ చర్యలకు సిద్ధమైంది. సూళ్లూరుపేట ఇన్‌చార్జి కమిషనర్ నుంచి పూర్వపు ప్రజారోగ్యశాఖ ఇన్‌స్పెక్టర్‌గా రివర్షన్ ఇస్తూ, ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల మరికొన్ని చర్యలకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీనిపై చిన్నయ్య న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆయన సూళ్లూరుపేట ఇన్‌చార్జి కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

మతాంతర వివాహం చేసుకుందని అక్కపై చెల్లి దాడి

బంగారుపాళ్యం, మే 4 (ఆంధ్రజ్యోతి): మతాంతర వివాహం చేసుకున్న అక్కపై చెల్లి దాడి చేసిన సంఘటన బంగారుపాళ్యం మండలంలోని కాటప్పగారిపల్లెలో జరిగింది. ఎస్‌ఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. కాటప్పగారిపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు రాజశేఖర్ పలమనేరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అదే కాలేజీలో పలమనేరుకు చెందిన మునీష్ బాషా కుమార్తె చాందినీ కూడా ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. వీరిద్దరూ ప్రేమించుకున్నారు. మరోవైపు చాందినీకి పెళ్లిచూపులు జరిగాయి. ఈ క్రమంలో రాజశేఖర్, చాందినీలు మార్చి 28వ తేదీన ఓ అమ్మవారి గుడిలో పెళ్లి చేసుకున్నారు. వీరు ఏప్రిల్ రెండో తేదీన ఎస్పీని కలిసి రక్షణ కల్పించాలని కోరారు. ఎస్పీ ఆదేశాలతో బంగారుపాళ్యం పోలీసులు ఇరు కుటుంబాలను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. ఈ నేపథ్యంలో మతాంతర వివాహం చేసుకుందని చాందినీ చెల్లెలు తస్మీయా కోపం పెంచుకుంది. ఆమె ఆదివారం కాటప్పగారిపల్లెకు చేరుకుని అక్క, బావలపై తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేయగా.. వారిద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. రాజశేఖర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

'ఏఐవైఎఫ్' మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ

చిత్తూరు అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరగనున్న ఏఐవైఎఫ్ జాతీయ మహా సభల పోస్టర్లను స్థానిక సీపీఐ కార్యాలయంలో నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కత్తి రవి మాట్లాడుతూ.. ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో తొలిసారిగా మహాసభలు జరుగుతున్నాయని చెప్పారు. దేశంలో పేరుకుపోతున్న నిరుద్యోగం, అశాంతి, ప్రాంతీయత, మతతత్వ విధానాలు, జాతీయ విద్యా విధానం, ఉపాధి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి.. భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నేతలు ప్రవీణ్‌కుమార్, మల్లికార్జున్, నాగ చైతన్య, రంగారావు, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధర్మరాజు ఆలయ మహాకుంభాభిషేకం



కుంభాభిషేకం నిర్వహిస్తున్న అర్చక, పండితులు
- పాల్గొన్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

గుడిపాల, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిళ్లారికుప్పంలో నూతనంగా నిర్మించిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాకుంభాభిషేకాన్ని అర్చక, పండితులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం యాగశాలలో అర్చక పండితులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త మొగిలిరెడ్డి ఆధ్వర్యంలో కుంభ జలాన్ని అర్చక పండితులు ఆలయ గోపురం పైకి తీసుకెళ్లారు. వైభవోపేతంగా కుంభాజలాన్ని ఆలయ గోపురంపై పోసి మహాకుంభాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ హాజరు కాగా, కార్యనిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, టీడీపీ నాయకులు బాలాజీ నాయుడు, హేమాద్రి నాయుడు, గోళ్ల హరిప్రసాద్, బాలసుబ్రహ్మణ్యంయాదవ్, అర్జున్‌గౌండర్, ఐజాక్, మాజీ జడ్పీటీసీ సుమతి, చిత్తూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి, వసంతాపురం సర్పంచ్ రజనీకాంత్ పాల్గొన్నారు.

మాతమ్మ సేవలో ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, మే 4 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని గుండ్రాజుకుప్పం ఆదిఆంధ్రవాడలో ఆదివారం జరిగిన మాతమ్మ ఆలయ మహాకుంభాభిషేకంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఎమ్మెల్యేకి స్థానికులు మంగళవాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు ఆయనను వేద మంత్రాలతో ఆశీర్వదించారు. టీటీడీకి చెందిన శ్రీవాణి ట్రస్టు ద్వారా వచ్చిన రూ.12 లక్షల విరాళాలతో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో జరిగిన కుంభాభిషేకంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మాజీమంత్రి రోజా కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

నగరిలో నటి కీర్తిచావ్లా హల్‌చల్



మాతమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న కీర్తిచావ్లా

నగరి, మే 4 (ఆంధ్రజ్యోతి): సినీనటి కీర్తిచావ్లా నగరి పట్టణం, మండలంలో ఆదివారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తన మేనేజర్ టీడీపీకి చెందిన రామానుజం చలపతితో కలిసి నగరి మండలం గుండ్రాజుకుప్పం ఆదిఆంధ్రవాడలో జరిగిన మాతమ్మ గుడి కుంభాభిషేకంలో ఆమె పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. నగరి మున్సిపాలిటీ ఒకటో వార్డులో చలపతితో కలిసి తెలుగు మహిళలకు టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఆదిఆంధ్రవాడలో యువతకు క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లత, అలిమేలు, రాధ, భారతి, ఆదెమ్మ, గజేంద్ర, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాకుంభాభిషేకం వేడుకలు



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

పాలసముద్రం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకావేరిరాజుపురంలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి, రాధారుక్మిణి సమేత కృష్ణమూర్తి స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల మధ్య సప్తమి తిథి, పుష్యమి నక్షత్రంలో మహాకుంభాభిషేకాన్ని అర్చక, పండితులు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం నుంచి యాగశాలలో కలశాలు పెట్టి ప్రతి రోజు ఉదయం, సాయంత్ర పూజలు, హోమం నిర్వహించారు. ఆదివారం యాగశాల నుంచి అర్చక, పండితులు శాస్త్రోక్తంగా కుంభజలాన్ని తీసుకెళ్లి ఆలయ గోపురంపై అభిషేకించారు. అనంతరం గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

మామిడి తోట దహనం?

- నిప్పుపెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు



శ్రీరంగరాజపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు మామిడి తోటకు నిప్పు పెట్టిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు ఎస్ఆర్‌పురం మండలం పుల్లూరు గ్రామానికి చెందిన రైతు భాస్కర్ నాయుడు, ఎగువకమ్మకండ్రిగ సమీపంలో సర్వేనెంబర్ 161/ఎలో నాలుగు ఎకరాల మామిడి తోట ఉంది. ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు మామిడి తోటకు నిప్పు పెట్టడంతో చెట్లకు ఏర్పాటు చేసిన డ్రిప్ పైపులు, మామిడి కాయలు పూర్తిగా కాలిపోయాయి. సుమారు లక్ష రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని రైతు భాస్కర్ నాయుడు వాపోయారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

సీఎం సహాయనిధి పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొగ్గలవారి కండ్రిగకు చెందిన ఢిల్లీబాబుకు సీఎం సహాయనిధి చెక్కు రూ.97,758లను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదివారం తిరుపతిలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, హరికృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా లక్ష్మీనారాయణుల కల్యాణం

గంగాధరనెల్లూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణుల ఆలయంలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత నారాయణులకు కల్యాణోత్సవం వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారాయణునికి పట్టువస్త్రాలు, పూలహారాలు అలంకరించి, అర్చకుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవం పూజలను ఘనంగా నిర్వహించగా, భక్తులు కనులపండుగగా వీక్షించారు. ఈకార్యక్రమంలో ఆలయమేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, భక్తులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో



బాపిరెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), మే 4 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో బాపిరెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వారిని ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం వారిని వేదమంత్రాలతో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డుపై గ్రూ కటింగ్



సిమెంటు రోడ్డుపై గ్రూ కటింగ్ చేస్తున్న దృశ్యం

విజయపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన విజయపురంలో ఆదివారం సిమెంటు రోడ్డుపై గ్రూ కటింగ్ నిర్వహించారు. విజయపురం మిట్టూరు, ఇందిరక్రాంతి భవనం ఎదుట రూ.50 లక్షలతో వేసిన సిమెంటు రోడ్డుకు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్ రోడ్డు గ్రిప్ కోసం గ్రూ కటింగ్ నిర్వహించారు. ప్రభుత్వం ప్రతి వీధిలో సిమెంటు రోడ్డు వేసి ఇచ్చిన హామీని నెరవేర్చిందన్నారు.

విట్ ఫలితాల్లో టౌన్ టాపర్లు



సాహితి, అనీష్

చిత్తూరు సెంట్రల్, మే 4 (ఆంధ్రజ్యోతి): వీఐటీ ఈఈఈ (విట్)2025 ఆదివారం వెల్లడించిన పోటీ పరీక్షల్లో స్థానిక పీఎస్ఎన్ శ్రీవివేకానంద విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి చిత్తూరు టాపర్లుగా నిలిచినట్లు కరస్పాండెంట్ పీఎస్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నాగరాజశెట్టి తెలిపారు. జాతీయ స్థాయిలో పి.సాహితి 2153వ ర్యాంకు సాధించగా, పి.అనీష్ 4653, ఆర్.మన్యతారెడ్డి 9585, కె.తేజ 10,770, కె.పవన్‌కల్యాణ్ 11,381, పి.యోహిత్ సాయి 13,971వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. వీరిని కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

పదవీ విరమణ సన్మానం



లోకనాథరెడ్డిని సన్మానిస్తున్న బాలాజీనాయుడు

గుడిపాల, మే 4 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలో వెలుగు సీసీగా పని చేస్తున్న లోకనాథరెడ్డి పదవీ విరమణ పొందడంతో ఆదివారం వెలుగు కార్యాలయంలో రాజకీయ నాయకులు, వెలుగు సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు సుధారాణి, మల్లీశ్వరి, మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు, టీడీపీ నాయకులు హరిప్రసాద్, చల్లా, చెందు, అనిల్‌కుమార్, వైసీపీ నాయకులు రజనీకాంత్, రుష్యేంద్రరెడ్డి, వెలుగు సీసీలు, సంఘమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అర్జున తపస్సు

పాలసముద్రం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆముదాల గ్రామంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం అర్జున తపస్సు కార్యక్రమం జరిగింది. అర్జున వేషధారి పద్యాలు పాడుతూ ఒక్కొక్క మెట్టు ఎక్కి పైనుంచి విభూది, నిమ్మపండ్లను విసిరారు. కోర్కెలు కోరుకున్న మహిళలు విభూది, నిమ్మకాయలను తమ కొంగుతో పట్టుకున్నారు. చివరగా మహిళలు తపస్సు మాను చుట్టూ వరపడ్డారు. ఈ వేడుకలను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఆలయ ఆవరణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



బాలాజీ కాలనీ వద్ద భీకరమైన గాలివాన - లక్ష్మీనగర్ కాలనీలో నేలకొరిగిన చెట్లను తొలగిస్తున్న జీజేఎం యూత్ సభ్యులు - చిరిగిపోయిన ఫ్లెక్సీలు

లోతట్టు ప్రాంతాలు జలమయం



ఎమ్మెస్సార్ సర్కిల్‌లో రోడ్డుపై నిలచిన మురుగునీరు - వెంగళ్రావుకాలనీలో రోడ్డుపై చేరిన వర్షపు నీరు - సంతపేట లిల్లీబ్రిడ్జిపై వాలిన విద్యుత్ స్తంభం

చిత్తూరు అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలైన మిట్టూరు, పొన్నియమ్మన్‌గుడివీధి, ఓబనపల్లె, రిక్షాకాలనీ, గంగనపల్లె, తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు వీధుల్లో ప్రవహించడంతో ప్రజలు, వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం నాలుగు గంటలకు తుంపర్లతో ప్రారంభమై ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మురుగుకాల్వల్లో పొంగిపొర్లిన వర్షపు నీరు రోడ్లపైకి రావడంతో వీధులన్నీ బురదమయమయ్యాయి. విజయలక్ష్మీనగర్ కాలనీలోని మూడో వీధిలో విరిగిపడ్డ పెద్ద విద్యుత్ స్తంభాన్ని, పలు చోట్ల విరిగిపడిన చెట్ల కొమ్మలను కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశాలమేరకు ప్రజారోగ్యశాఖ, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, జీజేఎం యూత్ సభ్యులు కూడా సహాయక చర్యల్లో స్వచ్ఛందంగా పాల్గొని తొలగించారు. సంతపేట లిల్లీ బ్రిడ్జి వద్ద ఓ విద్యుత్ స్తంభం వాలిపోయింది. కొన్ని చోట్ల అడ్వయిజ్‌మెంట్లు, రాజకీయ నేతలకు సంబంధించిన ఫ్లెక్సీలు ఊడిపడ్డాయి. ఈదురు గాలుల కారణంగా నగరంలో పలుచోట్ల విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లపై పడటంతో తెగిపోయాయి. దాంతో కొన్ని చోట్ల గంటల కొద్దీ విద్యుత్ సరఫరాల లేకపోవడంతో ఇంట్లో ఉండలేక జనం ఇబ్బంది పడ్డారు.

- చిత్తూరు రూరల్: చిత్తూరు రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో కూడా గాలివాన వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వెంటనే స్పందించిన చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర ఆదేశాలతో విద్యుత్ శాఖ అధికారులు చిత్తూరు నగరంతో పాటు రూరల్ మండలంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.
- యాదమరి: యాదమరి మండలంలో మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం గాలి, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం సుమారు గంట పాటు కురిసింది. వేసవిలో అకాలవర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వీధుల్లో మురుగు, వాన నీరు ప్రవహించడంతో జనాలు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గంగజాతరకు ఏర్పాట్లు షురూ



మురకంబట్టు నడివీధి గంగమ్మ తల్లి

చిత్తూరు కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల ఆరవ తేదీ నుంచి నగరంలో నిర్వహించనున్న నడివీధి గంగజాతరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మురకంబట్టులో స్థానిక కార్పొరేటర్లు నవీన్‌కుమార్, సహదేవల ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. అదే విధంగా ప్రధానమైన చిత్తూరు నడివీధి గంగజాతరకు మంగళవారం చాటు కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నగరవాసులు ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో, వర్షాలు మెండుగా కురిసి, ఎలాంటి కష్టాలు లేకుండా సంతోషంగా జీవించడానికిగాను భక్తులు అమ్మవారి జాతరను ప్రతియేటా వసంత రుతువు వైశాఖ మాసంలో చివరి మంగళవారం నడివీధి గంగజాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఈనెల 6న జాతరకు సాంప్రదాయంగా చాటు నిర్వహించి, అనంతరం 13వ తేది మంగళవారం వరకు రోజుకొక అలంకారంతో భక్తులు అమ్మవారిని కొలిచి, పొంగళ్లు పెట్టి నైవేద్యం, అంబలి సమర్పించి మొక్కుకుంటారు.

స్వార్థ ప్రయోజనాలకు వాడుకోకండి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న స్క్రాప్ వ్యాపారస్తులు

చిత్తూరు సెంట్రల్, మే 4(ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులు స్క్రాప్ వ్యాపారస్థుల నుంచి కిలోకు రూపాయి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు పచ్చి అబద్ధాలని వ్యాపారస్తులు అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో స్క్రాప్ వ్యాపారస్తులు మీడియాతో మాట్లాడుతూ మాకు రాజకీయాలతో సంబంధం లేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రశాంతంగా వ్యాపారం చేసుకుంటున్నామన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు మమ్మల్ని పావులుగా వాడుకోరాదని, వైసీపీ నాయకులు తమపై చేస్తున్న తప్పుడు ప్రచారాలు నమ్మరాదని వ్యాపారస్తులు స్పష్టం చేశారు.

- మా పొలంలో రోడ్డువేసి వేధింపులు

పెనుమూరు మండలం మాజీ ఎంపీటీసీ అరుణకుమారి మా పొలంలో దౌర్జన్యంగా రోడ్డు వేసి నిత్యం వేధింపులకు గురిచేస్తున్నారని సామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉష, సుజనలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే థామస్ పేరును అడ్డంపెట్టుకుని అరుణకుమారి అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. సర్వే రికార్డు ప్రకారం సామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అరుణ ఆక్రమించుకున్న భూమిలో రోడ్డు మార్గం ఉందని, ఆమె రోడ్డు పోతుందనే బాధతో తమపై గ్రామస్థులను రెచ్చగొట్టి దౌర్జన్యంగా మా పొలంలో రోడ్డు వేయించడంతో పాటు మాపై తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. ఎమ్మెల్యే వాస్తవాలు తెలుసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



సన్మానం పొందిన విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, మే 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని జిల్లా యాదవ్ ఎంప్లాయిస్ సొసైటీ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక టీటీడీ కల్యాణ మండలంలో సంఘం ఆధ్వర్యంలో టెన్త్‌లో 500 మార్కులు పైబడి మార్కులు సాధించిన యాదవ విద్యార్థుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. లింగమూర్తి యాదవ్ మాట్లాడుతూ యాదవ విద్యార్థుల చదువులకు సంఘం అన్ని రకాల సహకారం అందిస్తుందన్నారు. అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన 140 మంది యాదవ విద్యార్థులను మెమెంటోలు బహూకరించి, ప్రశంసాపత్రం, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు బోడే మోహన్ యాదవ్, చిట్టిబాబు, విక్రమ్, కుమార్, జయసిల్క్ యజమాని భాగ్యరాజ్, అశోక్ ఆనంద్, నవీన్, కోదండ, వెంకటేష్, గోవిందస్వామి, లక్ష్మీపతి, భాస్కర్, గురుమూర్తి డిల్లీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దుర్యోధన వధ

గుడిపాల, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పానాటూరులోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా చివరి రోజున నిర్వహించిన దుర్యోధన వధ కార్యక్రమం అందరినీ అలరించింది. దుర్యోధన, అర్జున వేషధారులు నిర్వహించిన సన్నివేశాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేశారు.

ఎట్టకేలకు బాగుపడింది

- ఇది మంచి ప్రభుత్వం



నాడు: పచ్చికాపల్లం జడ్పీ కళాశాల ముందు ఉన్న కంపు

వెదురుకుప్పం, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు బాగుపడింది. ఇది మంచి ప్రభుత్వం.. మంచే జరిగింది. ఎంతో కాలంగా మురికి కాలువ కంపు, దోమలు, ఆక్రమణలతో ఉన్న వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం జడ్పీ జూనియర్ కళాశాల విద్యార్థులకు దోమల బెడద తప్పింది. ఆ కళాశాల ప్రహరీని అనుకుని ఉన్న స్థలంలో ఆక్రమణలు తొలగిపోయాయి. పచ్చగడ్డి కనిపించలేదు. మురికినీరు కంపు లేదు. దోమల బెడద అంతకన్నా లేదు. జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ వచ్చాక ఆ పాఠశాలకు కొత్త హంగు వచ్చింది. వైసీపీ పాలనలో ఆక్రమణల గురించి, దోమల బెడద గురించి ఎవరికి చెప్పినా పట్టించుకోలేదు. మురికి నీటి కాలువలపై బండలు వేశారు. పచ్చని పిచ్చిమొక్కలు, గడ్డి తొలగిపోయింది. ఆక్రమణలను తొలగించారు. పాఠశాల స్థలం వరకు ఫెన్సింగ్ వేసి బాగు చేశారు. ప్రస్తుతం అక్కడ కొత్త హంగు ఏర్పడింది.



నేడు: పచ్చికాపల్లం జడ్పీ కళాశాల ముందు కొత్త హంగు

సంగీత సమ్మేళనం

చిత్తూరు కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): కొంగారెడ్డిపల్లెలో ఆదివారం శ్యామల మెగా మ్యూజిక్ ఈవెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సంగీత సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 30 మంది కళాకారులు పాల్గొని తమ గాత్ర పదర్శనతో శాస్త్రీయ, సినీ, లలిత సంగీత ప్రదర్శనలతో నగరవాసులను అలరించారు. కార్యక్రమ నిర్వాహకురాలు శ్యామల కళాకారులకు మెమెంటోలు అందజేసి సత్కరించారు.

కర్నూలు సీడీసీఎంఎస్ ఛైర్మన్‌కు సన్మానం



నాగేశ్వరయాదవ్‌ను సన్మానిస్తున్న శ్రీధర్‌యాదవ్, కోదండయాదవ్

గంగాధరనెల్లూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు నాగేశ్వరయాదవ్‌ను ఇటీవల కూటమి ప్రభుత్వం కర్నూలు జిల్లా సీడీసీఎంఎస్ ఛైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే. కాగా ఆదివారం చిత్తూరు జిల్లా టీడీపీ కార్యాలయానికి వచ్చిన నాగేశ్వరయాదవ్‌ను జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, జిల్లా టీడీపీ ప్రధానకార్యదర్శి కోదండయాదవ్‌లు శాలువలతో సన్మానం చేశారు. రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, నంద్యాల బీసీ సాధికార అధ్యక్షులు గుర్రప్ప యాదవ్, నెల్లేపల్లె టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి నివాళి



గంగాధరనెల్లూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండలానికి మొదటి ఎంపీపీగా కొనసాగిన కామసాని గుండ్రెడ్డి రాజారెడ్డి అలియాస్ కె.జి.రాజారెడ్డి గత నెల 22న అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. మండలంలోని కోటాగరం పంచాయతీ ఎట్టేరిలో ఆదివారం రాజారెడ్డికి కుటుంబ సభ్యులు కర్మక్రియలు నిర్వహించారు. వైసీపీ నేతలతో కలిసి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, సత్యవేడు వైసీపీ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్‌లు వేర్వేరుగా ఎట్టేరిలో రాజారెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించి, కుటుంబసభ్యులను కలిసి పరామర్శించారు.